

సమావేశంలో మాట్లాడుతున్న మంచిరెడ్డి కిషన్‌రెడ్డి

ఫార్మాసిటీ రద్దు హామీ ఏమైంది?

- రైతులను మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం
- ధ్వజమెత్తిన బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి

యాచారం, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : తాము అధికారంలోకి రాగానే ఫార్మాసిటీని రద్దుచేసి, సేకరించిన భూములను రైతులకు ఇచ్చేస్తామన్న కాంగ్రెస్ నాయకులు భట్టి విక్రమార్క, సీతక్కల హామీ ఏమైందని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి ధ్వజమెత్తారు. ఆదివారం యాచారంలో జరిగిన ఆ పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఫార్మాసిటీ రద్దు చేయడం దేవుడెరుగు నేడు మళ్లీ భూసేకరణకు నోటీసులు ఇచ్చి రైతులను ఎందుకు ఇబ్బందుల పాలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. భూములు తీసుకోవాలనుకుంటే ఎకరాకు మార్కెట్ ధర చెల్లించి రైతులను ఆదుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇక్కడ నాలుగు ఫార్మా కంపెనీల ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం అగ్రిమెంట్ చేసుకుందన్నారు. రాష్ట్రంలో అరాచక పాలన సాగుతుందని మండిపడ్డారు. 14నెలల కాలంలో డివిజన్‌లో ఎనిమిది మంది సీఐలు మారారని, అధికారులు స్వేచ్ఛగా విధులు నిర్వర్తించకుండా ప్రజాప్రతినిధులు వారిపై బెదిరింపులకు దిగడం మంచిదికాదన్నారు. 2027లో జమిలి ఎన్నికలు వస్తాయన్నారు. అప్పుడు రేవంత్‌సర్కార్ కూలడం.. మళ్లీ కేసీఆర్ సీఎం కావడం తథ్యమన్నారు. సీఎంఆర్ఎఫ్ చెక్కులు కాలం తీరిన తరువాత ఇస్తున్నారని ఆరోపించారు. మైనింగ్ జోన్ ఏర్పాటుకు గోప్యంగా అధికారులు పావులు కదుపుతున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ విజయానికి ప్రతీ కార్యకర్త అంకితభావంతో పని చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో బీఆర్ఎస్ మండల అధ్యక్ష, కార్యదర్శులు కె.రమేష్‌గౌడ్, పి.బాషా, సొసైటీ చైర్మన్ టి.రాజేందర్‌రెడ్డి, వైస్‌చైర్మన్ కె.యాదయ్య, మాజీ జెడ్పీటీసీ చిన్నోళ్ల జంగమ్మ, నాయకులు లిక్కి నర్సింహారెడ్డి, శంకర్‌నాయక్, వి.రాజునాయక్, గోపాల్, చిక్కుడు గుండాలు తదితరులున్నారు.

భవన నిర్మాణ కార్మికులకు పెన్షన్ ఇవ్వాలి

ఏఐటీయూసీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రామస్వామి



మాట్లాడుతున్న రామస్వామి

చేవెళ్ల, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ రంగ కార్మికులకు ప్రభుత్వం పెన్షన్ సౌకర్యం కల్పించాలని ఏఐటీయూసీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రామస్వామి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో భవన నిర్మాణ కార్మిక సంఘం మండల మూడో మహాసభ సమావేశం మండల అధ్యక్షుడు రాంచందర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా రామస్వామి మాట్లాడుతూ.. భవన నిర్మాణ రంగంలో పని చేస్తున్న కార్మికులందరికీ రాష్ట్ర ప్రభుత్వం పెన్షన్ అందించాలని డిమాండ్ చేశారు. రూ.10 లక్షల ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలన్నారు. భవన నిర్మాణ కార్మికులకు ఏఐటీయూసీ నిరంతరం అండగా ఉంటుందన్నారు. చేవెళ్ల మండల భవన నిర్మాణ సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా శ్రీను, ఉపాధ్యక్షులుగా యాదగిరిబాబు, హన్మంతు, కార్యదర్శిగా శ్రీనివాస్, కార్యవర్గ సభ్యులుగా సావిత్రి, రాంచందర్, కృష్ణమురళి, శ్రీకాంత్, సుగుణమ్మ తదితరులను ఎంపిక చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి సత్యనారాయణ చారి, నాయకులు రాంచందర్, కార్మికులు తదితరులు ఉన్నారు.

మహేశ్వరం మార్కెట్ కమిటీ పాలకవర్గం ఏర్పాటు ఎప్పుడో? 7

నియామకంలో తీవ్ర జాప్యం



చేవెళ్ల పీఏసీఎస్



కొనసాగింపా.. ప్రత్యేకమా..?

ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల (పీఏసీఎస్) పాలకవర్గాల గడువు మరో ఐదు రోజుల్లోనే ముగియనుంది. కానీ, వీటికి ఎన్నికలు ఇప్పట్లో జరిగే అవకాశాలు కనిపించడం లేదు. ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు రాకపోవడంతో ఎన్నికల నిర్వహణకు అధికార యంత్రాంగం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. ప్రస్తుతం పంచాయతీ, ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల నిర్వహణపై ప్రభుత్వం ఫోకస్ పెట్టింది. ఈ ఎన్నికల తర్వాతనే సహకార సంఘాల ఎన్నికలు జరిగే అవకాశం ఉందనే చర్చ సాగుతోంది. ప్రభుత్వం అప్పటివరకు పాలకవర్గాన్ని పొడిగిస్తుందా...? లేదా ప్రత్యేక అధికారులను నియమిస్తుందా అనేది ప్రశ్నార్థకంగా మారింది.

15వ తేదీతో ముగియనున్న పీఏసీఎస్‌ల పాలకవర్గాల గడువు

- ఎన్నికల నిర్వహణకు జరగని ఏర్పాట్లు
- పంచాయతీ ఎన్నికల తర్వాత పరిశీలించే అవకాశం
- ఆరు నెలల పాటు గడువు పొడిగించే యోచనలో ప్రభుత్వం
- ఆ తర్వాతైనా ఎన్నికలు నిర్వహిస్తారా? లేదా అనే సందేహాలు

రంగారెడ్డి అర్బన్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో 38 ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు ఉన్నాయి. 2020 సంవత్సరంలో 37 పీఏసీఎస్‌లకు ఎన్నికలు జరిగాయి. అందులో సరూర్‌నగర్ మండలం మామిడిపల్లి పీఏసీఎస్ సక్రమంగా లేకపోవడంతో అక్కడ ఎన్నికలు నిర్వహించలేదు. ప్రతీ పీఏసీఎస్‌లో 13 మంది చొప్పున 37 సంఘాల్లో 481 డైరెక్టర్‌లను ఎన్నుకున్నారు. ఇవి పూర్తయిన మూడు రోజులకు ఆఫీస్ బేరర్ల ఎన్నికలు నిర్వహించారు. అదేనెల 20న జిల్లా కేంద్ర సహకారం బ్యాంకు(డీసీసీబీ), జిల్లా సహకార మార్కెటింగ్ సహకార సంస్థ (డీసీఎంఎస్) చైర్మన్, వైస్ చైర్మన్ పదవులకు ఎన్నికలు నిర్వహించారు. ప్రస్తుతం కొనసాగుతున్న 37 సంఘాల్లో 1,66,105 మంది సభ్యత్వం పొంది ఉన్నారు. వీరంతా 3749.779 లక్షలు వాటాధనం కింద చెల్లించారు. పాలకవర్గాల ఐదేళ్ల పదవీకాలం

మిగతా 8వ పేజీలో...

గ్రామాల అభివృద్ధికి అధిక నిధులు

జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎలుగంటి మధుసూదన్‌రెడ్డి



మధుసూదన్‌రెడ్డితో గ్రామస్తులు

షాబాద్, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి) : ప్రజాపాలనలో గ్రామాల అభివృద్ధికి అధిక నిధులు కేటాయిస్తున్నట్లు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎలుగంటి మధుసూదన్‌రెడ్డి తెలిపారు. ఆదివారం నాందార్‌ఖాన్‌పేట్ చెరువు కట్టపై సీసీ రోడ్డు వేయాలని, గ్రామంలో శ్మశానవాటిక ఏర్పాటు చేయాలని మాజీ ఎంపీటీసీ పొన్న వెంకట్‌రెడ్డి, మాజీ సర్పంచ్ లింగం, మాజీ ఉపసర్పంచ్ నారాయణ రెడ్డి గ్రామస్తులతో కలిసి మధుసూదన్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సమస్యల పరిష్కారానికి చొరవ చూపుతానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కావలి చంద్రశేఖర్, మాజీ సర్పంచులు జనార్దన్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, నాయకులు శేఖర్‌రెడ్డి, పద్మారెడ్డి, రాజు, మల్లేష్, సురేష్‌గౌడ్, వినోద్‌గౌడ్, మహేందర్ పాల్గొన్నారు.



హాజరైన భక్తులు

కమనీయం.. కల్యాణం

- వైభవంగా వేదాద్రి లక్ష్మీనరసింహ స్వామి పరిణయం
- ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి జూపల్లి

తలకొండపల్లి , ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వెల్జాల గ్రామంలోని వేదాద్రి గుట్టపై వెలసిన వేదాద్రి లక్ష్మీనరసింహ స్వామి దేవాలయంలో బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా ఆదివారం స్వామివారి కల్యాణం కనుల పండువగా జరిగింది. ఈ వేడుకకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. కార్యక్రమానికి రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కల్యాణం అనంతరం భక్తులు స్వామివారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి



కల్యాణ వేడుకలో మంత్రి జూపల్లి కృష్ణారావు

నారాయణ రెడ్డి, ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి, టాస్క్ సీఈవో సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే గుర్కా జైపాల్ యాదవ్, రాష్ట్ర వ్యవసాయ శాఖ కమిషన్ సభ్యుడు కేవీఎన్ రెడ్డి, రాష్ట్ర గిడ్డంగుల శాఖ మాజీ చైర్మన్ రజినిసాయి చంద్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు సీఎల్ శ్రీనివాస్ యాదవ్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ యాట గీతనర్సింహ్మ, వైస్ చైర్మన్ గూడూరు భాస్కర్‌రెడ్డి, ఎడ్మ సత్యం, గట్ల కేశవ రెడ్డి, ఉప్పల వెంకటేశ్, ముజుబుర్ రహెమాన్, శ్రీనివాస్‌యాదవ్ పాల్గొన్నారు.

పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి కార్యాచరణ

ఆమనగల్లు : నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి నియోజకవర్గంలో పర్యాటక ప్రాంతాల, దర్శనీయ స్థలాల అభివృద్ధికి రూ.5కోట్లు మంజూరు చేస్తున్నట్లు రాష్ట్ర పర్యాట శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రకటించారు. పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి సీఎం రేవంత్‌రెడ్డి కార్యాచరణను అమలు చేస్తున్నారని తెలిపారు. వేదాద్రి లక్ష్మీనర్సింహస్వామి ఆలయ అభివృద్ధికి రూ.10కోట్లు మంజూరు చేయాలని నాయకులు, ఆలయ కమిటీ మంత్రిని కోరారు.

వైభవంగా ఉత్సవమూర్తుల ఊరేగింపు

కందుకూరు, ఫిబ్రవరి 9,(ఆంధ్రజ్యోతి): కందుకూరు మండలంలోని గూడూరు వేంకటేశ్వర స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఈ నెల 6న ప్రారంభమైన ఉత్సవాలు సోమవారం ముగియనున్నాయి. ఈ నేపథ్యంలో ఆదివారం ఉదయం యాగశాల కైంకర్యంములు, తిరుచ్చి వాహనసేవ, సాయంత్రం 4 గంటలకు వసంతోత్సవం(తిరుచ్చి ఉత్సవాన్ని) తదితర కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారి ఉత్సవ విగ్రహాలను గ్రామంలోని పుర వీధుల్లో ఘనంగా ఊరేగించారు. కార్యక్రమంలో గూడూరు గ్రామస్తులతోపాటు పరిసర గ్రామాల ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు.



ఉత్సవ విగ్రహాల ఊరేగింపు



మంగల్‌పల్లిలోని ప్రైవేట్ హాస్టళ్లు

ప్రైవేట్ హాస్టళ్లలో భద్రతేదీ?

నిర్వహణను పట్టించుకోని యాజమాన్యాలు

- ఇటీవల విద్యార్థినిపై అఘాయిత్య ఘటనే నిదర్శనం
- భయాందోళనలో యువతులు
- ఇబ్రహీంపట్నం పరిధిలో 300కు పైగా వసతిగృహాలు
- కనీస సదుపాయాలు కరువు.. కొరవడిన అధికారుల పర్యవేక్షణ

ఆదిభట్ల, ఫిబ్రవరి9 (ఆంధ్రజ్యోతి): ఇబ్రహీంపట్నంలో ఇంజనీరింగ్, పీజీ కళాశాలలు ఎక్కువ సంఖ్యలో ఉన్నాయి. అలాగే అనేక కంపెనీలూ ఉన్నాయి. ఆదిభట్ల ఏరోస్పేస్ సెజ్‌లో ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన టీసీఎస్ లాంటి అంతర్జాతీయ సంస్థలు తమ కార్యకలాపాలు కొనసాగిస్తున్నాయి. కాలేజీల్లో చదువుకునే విద్యార్థులు, కంపెనీల్లో ఉద్యోగులు చేసేవారు స్థానికంగా ఉన్న ఏదో ఒక ప్రైవేటు హాస్టల్‌ను ఆశ్రయిస్తున్నారు.

ఇబ్రహీంపట్నం, ఆదిభట్ల, మంగల్‌పల్లిల్లో 300 పైగా హాస్టళ్లు ఉన్నాయి. ఇక్కడ వాటికి మంచి డిమాండ్ ఉండడంతో వ్యాపారం బాగానే సాగుతోంది. హాస్టల్ ఉండటానికి ఒక్కో విద్యార్థి నుంచి నెలకు రూ.4వేల నుంచి రూ.5 వేల వరకు తీసుకుంటున్నారు. ఒక్క మంగల్‌పల్లి సమీపంలోనే 100 హాస్టళ్లు ఉన్నాయి. కానీ బాలికలు, వర్కింగ్ ఉమెన్స్ హాస్టళ్ల యాజమాన్యాలు నిబంధనలు పాటించకుండా ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నాయి. విద్యార్థినులు, యువతుల భద్రత పట్ల ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. ఇటీవల ఓ హాస్టల్‌లో ఇంజనీరింగ్ మొదటి సంవత్సరం విద్యార్థినిపై ఓ డ్రైవర్ అఘాయిత్యానికి పాల్పడడమే ఇందుకు నిదర్శనం. హాస్టల్ నిర్వాహకులు వారి నైతిక బాధ్యత విస్మరించడంతో విద్యార్థుల రక్షణ ప్రశ్నార్థకంగా మారింది.

హాస్టళ్లలో పరిస్థితి ఇదీ..

ప్రైవేటు హాస్టళ్ల నిర్వాహకులు నిబంధనలు పాటించకుండా ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. ఇబ్రహీంపట్నం, మంగల్‌పల్లి సమీపంలో ఇంజనీరింగ్, ఫార్మసీ, ఎంబీఏ, డిగ్రీ ఇతర ప్రొఫెషనల్ కోర్సులు అందిస్తున్నాయి. వాటిలో చదువుకునే వేలాది మంది విద్యార్థులు భోజనం, వసతి కోసం ప్రైవేటు హాస్టళ్లను ఆశ్రయిస్తున్నారు. మహిళల

మిగతా 8వ పేజీలో...

సమతామూర్తి స్ఫూర్తి కేంద్రంలో బ్రహ్మోత్సవాలు ప్రారంభం

- శ్రీరామానుజ చార్యుల, 108 దివ్య దేశాల్లో ప్రత్యేక పూజలు
- చిన జీయర్‌స్వామి పర్యవేక్షణలో 19 వరకు ఉత్సవాలు

శంషాబాద్ రూరల్ ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): శంషాబాద్ మండలం ముచ్చింతల్‌లోని సమతామూర్తి స్ఫూర్తి కేంద్ర తృతీయ బ్రహ్మోత్సవాలు ఆదివారం వైభవోపేతంగా ప్రారంభమయ్యాయి. ఆధ్యాత్మిక గురువు చినజీయర్‌స్వామి పర్యవేక్షణలో ఉత్సవాలు కొనసాగనున్నాయి. ఉదయం 11గంటలకు నగరంలోని నెక్లెస్ రోడ్డులోని డాక్టర్ అంబేడ్కర్ విగ్రహం నుంచి పీపుల్స్ ప్లాజా వరకు వికాస తరంగిణి సంస్థతో కలిసి భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం చిన జీయర్‌స్వామి మాట్లాడుతూ... సమసమాజ నిర్మాణానికి అంబేడ్కర్ చేసిన కృషిని మరవలేమన్నారు. అంబేడ్కర్ స్ఫూర్తిగా నిలిచిన శ్రీ రామానుజాచార్యుల బ్రహ్మోత్సవాలను ఆయన విగ్రహం నుంచే ప్రారంభించుకోవడం శుభసూచకమన్నారు. సమతాయాత్రను ఏర్పాటు చేశామన్నారు. యాత్రలో కాంగ్రెస్ నాయకుడు అద్దంకి దయాకర్ పాల్గొన్నారు. ఉదయం స్వర్ణ విగ్రహానికి, 108 దివ్య దేశాల ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం విశ్వక్సేన ఆరాధనను నిర్వహించారు. బ్రహ్మోత్సవాలు ఈ నెల 19 వరకు నిర్వహిస్తామని స్వామిజీ తెలిపారు. బ్రహ్మోత్సవాల మొదటి రోజు హైదరాబాద్ నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. కార్యక్రమంలో అహోబిల జీయర్‌స్వామి, దేవనాథ జీయర్‌స్వామి, మైహోం గ్రూప్ అధినేత జూపల్లి రామేశ్వర్‌రావు కుటుంబీకులు, జగపతిరావు తదితరులు పాల్గొన్నారు.



స్వర్ణ విగ్రహానికి పూజలు నిర్వహిస్తున్న వేద పండితులు

హక్కుల సాధనకు కురుమలు ఏకం కావాలి



బాలయ్యకు నియామక పత్రాన్ని అందజేస్తున్న నాయకులు

మహేశ్వరం, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): హక్కుల సాధనకు రాజకీయాలకు అతీతంగా కురుమలు ఏకతాటిపైకి రావాలని సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కృష్ణగోని సదానందం, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు సిద్దాల దశరథ అన్నారు. ఆదివారం పెంటల రాయప్ప అధ్యక్షతన మహేశ్వరంలో మండల కురుమ సంఘం సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథులుగా హాజరైన మాట్లాడుతూ.. ప్రభుత్వాలు, పాలకులు మారుతున్నారే తప్ప కురుమల బతుకులు బాగుపడడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రానున్న స్థానిక ఎన్నికల్లో కురుమలు సత్తా చాటాలన్నారు. కురుమలు ఏ పార్టీలో ఉన్నా రాజకీయ పదువుల కోసం ఉద్యమించాల్సిందేనన్నారు. ఈ సందర్భంగా మహేవ్వరం మండల సంఘం అధ్యక్షుడిగా మహేశ్వరానికి చెందిన పొల్కం బాలయ్యను ఏకగ్రీవంగా ఎనున్నకున్నట్లు తెలిపారు.

మండల కురుమ సంఘం కమిటీ: మండల కురుమ సంఘం ఉపాధ్యక్షులుగా గుత్తి పాండు, యాదయ్య, రఘుపతి, చంద్రయ్య, పర్వతాలు, వెంకటేష్, ప్రధాన కార్యదర్శి కె.భాస్కర్, కోశాధికారి సురేష్, సహాయ కార్యదర్శులు కృష్ణ, రాజు, సలహాదారులు పెంటల రాయప్ప, కుండె వెంకటేష్, ముత్యం, మిద్దింటి బాల్రాజ్, కుమార్, శ్రీను, రమేష్, చంద్రయ్య, మల్లేష్, కార్యవర్గ సభ్యులుగా శేఖర్, సురేష్, పాండు, గణేష్, వెంకటేష్, సాయులు ఎన్నికయ్యారు.

పాన్ మసాలా స్థావరాలపై దాడులు

● రూ.35లక్షల విలువైన ప్యాకెట్లు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న పాన్ మసాలా ప్యాకెట్లు

తాండూరు, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): తాండూరు పట్టణంలో పాన్ మసాలా స్థావరాలపై జిల్లా టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఆదివారం దాడులు నిర్వహించి రూ.35లక్షల విలువైన ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం వికారాబాద్ జిల్లా ఎస్పీ నారాయణరెడ్డి ఆదేశాల మేరకు టాస్క్‌ఫోర్స్ ఎస్ఐ ప్రశాంత్‌వర్ధన్ ఆధ్వర్యంలో తాండూరు ధన్‌గర్‌గల్లీలో పలు దుకాణాల్లో దాడులు నిర్వహించారు. పావని కిరాణ మర్చంట్స్‌లో రూ.35లక్షలు విలువైన పాన్ మసాలా ప్యాకెట్లను స్వాధీనం చేసుకొని పట్టణ పోలీసులకు అప్పగించారు. కాగా జీఎస్టీ బిల్లులు లేకనే స్వాధీనం చేసుకున్నామని, యజమానులు బిల్లులు చూపడంతో తిరిగి పాన్ మసాలా ప్యాకెట్లను అప్పగించినట్లు తాండూరు పట్టణ పోలీసులు పేర్కొన్నారు.

గ్రామ దేవతలు పల్లెలకు శ్రీరామ రక్ష



విగ్రహాల ప్రతిష్ఠాపనలో ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి

షాద్‌నగర్ అర్బన్, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): గ్రామ దేవతలను నిష్టతో ప్రతిష్ఠించి, పూజలు చేస్తే పల్లెల్లో ప్రగతి సాధ్యం అని మహబూబ్‌నగర్ ఎమ్మెల్సీ ఎన్.నవీన్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఫరూఖ్‌నగర్ మండలం కందివనంలో బొడ్రాయి, మైసమ్మ విగ్రహ ప్రతిష్ఠా పూజలు ఆదివారం మొదలయ్యాయి. ఉదయం హోమాలు, సాయంత్రం విగ్రహాల ఊరేగింపు నిర్వహించారు. సోమవారం విగ్రహాలకు ప్రాణ ప్రతిష్ఠ చేస్తారు. పూజలకు నవీన్‌కుమార్‌రెడ్డి హాజరయ్యారు. నియమనిష్ఠలతో గ్రామ దేవతలను కొలుస్తూ, అభివృద్ధి చెందాలన్న పట్టుదలతో ముందుకు సాగే గ్రామాలు ఎంతో ఆనందంగా, ఉన్నతంగా ఉంటాయని నవీన్‌కుమార్‌రెడ్డి అభిప్రాయపడ్డారు. దైవ చింతనతో మెలిగే గ్రామాల్లో ఎల్లప్పుడూ శాంతి సామరస్యాలు నెలకొంటాయని, ప్రజలు సుఖసంతోషాలతో ఉంటారన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు శివజ్యోతి, అమృనాయక్, గ్రామస్థులు కె.సూర్యప్రకాశ్, ఆంజనేయులు, నర్సింహులుగౌడ్, వెంకట్‌రెడ్డి, శంకరయ్యగౌడ్, శివశంకర్, రాజు, కృష్ణారెడ్డి, యాదగిరి, రమేష్ పాల్గొన్నారు.

దొంగతనాల నివారణకు ప్రజల్లో అవగాహన



పట్టణంలో ఆటోల ద్వారా ప్రచారం నిర్వహిస్తున్న పోలీసులు

తాండూరు, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): శనివారం తాండూరులో రెండిళ్లలో చోరీలు జరడంతో వాటి నివారణకు పోలీసులు చర్యలకు ఉపక్రమించారు. చోరీల పట్ల ప్రజలు జాగ్రత్త వహించాలని సూచిస్తున్నారు. తాండూరులో రెండు ఆటోలను తిప్పి 'దొంగతనాలపై పోలీసు వారి హెచ్చరిక' అని పేర్కొంటూ మైక్ అనౌన్స్‌మెంట్ చేస్తున్నారు. 'మీ వాహనాలకు తాళాలు వేసుకోవాలి. అనుమానిత వ్యక్తులుంటే డయల్ 100, లేదా పోలీసులకు సమాచారం ఇవ్వాలి.' అని చెబుతున్నారు. బయటకు వెళ్లేప్పుడు తాళం కన్పించకుండా వేసుకోవాలని, ఇంట్లో ఒకటి, రెండు లైట్లు వేసే ఉంచాలని, ఇళ్లలో ఎవరూ లేరనే విషయం తెలువనీయొద్దని పేర్కొంటున్నారు.

డాక్టర్ల నిర్లక్ష్యంతో వ్యక్తి మృతి?

● కుటుంబీకుల ఫిర్యాదుతో కేసు నమోదు



సత్యగౌడ్(ఫైల్)

ఆదిభట్ల, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తి హఠాత్తుగా చనిపోవడంతో వైద్యులు నిర్లక్ష్యం వల్లే అతడు మృతిచెందాడని కుటుంబీకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఘటన రంగారెడ్డి జిల్లా ఆదిభట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం చోటుచేసుకుంది. మృతుడి కుటుంబీకులు, ఎస్సై రాజు తెలిపిన వివరాల ప్రకారం.. అబ్దుల్లాపూర్‌మెట్టు మండలం తుర్కయంజాల్ శ్రీరామ్‌నగర్ కాలనీకి చెందిన గజ్జ సత్యగౌడ్(46) శనివారం కడపు నొప్పి రావడంతో 'యంజాల్ హాస్పిటల్' అనే ప్రైవేట్ దవాఖానాకు వెళ్లాడు. అక్కడి డాక్టర్ చెక్‌చేసి గ్యాస్ట్రిక్ సమస్య ఉందని నిర్ధారించి అడ్మిట్ చేసుకొని వైద్యం చేశారు. శనివారం రాత్రి బాగానే ఉన్న సత్యగౌడ్ ఆదివారం ఉదయం మరణించాడు. దీంతో కుటుంబ సభ్యులు డాక్టర్లను నిలదీశారు. అతడు హార్ట్‌స్ట్రోక్‌తో చనిపోయాడని వైద్యులు తెలిపారు. ఈ విషయం తెలుసుకున్న సీపీఎం, సీపీఐ నాయకులు హాస్పిటల్ వద్ద ధర్నా చేశారు. డాక్టర్ల నిర్లక్ష్యం, సరైన వైద్యం చేయకే తన తండ్రి చనిపోయడని సత్యగౌడ్ కొడుకు ప్రవీణ్‌గౌడ్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజు తెలిపారు.



ఆస్పత్రి వద్ద ఆందోళన చేస్తున్న కుటుంబీకులు, నాయకులు

కీసరలో జైలర్ దంపతుల పూజలు


స్వామివారి చిత్రపటం అందజేస్తున్న నారాయణ

కీసర, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి) : కీసర, చీర్యాల్ లక్ష్మీనరసింహ స్వామి దేవాలయంలో ఆదివారం వరంగల్ రేంజ్ జైలర్ సంపత్‌కుమార్ దంపతులు ఆదివారం ఉదయం స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ఫౌండర్ లక్ష్మీనారాయణ సంపత్‌కుమార్ దంపతులకు స్వామివారి పట్టువస్త్రాలు, చిత్రపటాన్ని అందజేశారు.

డాక్టర్ జయప్రసాద్‌కు అవార్డు ప్రదానం



గవర్నర్ నుంచి అవార్డు అందుకుంటున్న జయప్రసాద్

తాండూరు, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో తాండూరుకు చెందిన జనరల్ సర్జన్ డాక్టర్ జయప్రసాద్ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. వైద్య విభాగంలో అత్యున్నత సేవలు అందించినందుకు గాను అవార్డు వరించింది. కార్యక్రమంలో బీజేపీ జాతీయ నేత మురళీధర్‌రావు, డిఆర్‌డిఎల్ డైరెక్టర్ శ్రీనివాస మూర్తి, అధికార భాషా సంఘం నాయకులు విజయబాబు, తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలకు ఆకర్షితులై..


బీజేపీలో చేరిన నేతలకు కండువా కప్పి ఆహ్వానిస్తున్న ఎంపీ ఈటల

కీసర, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి) : ప్రధాని మోదీ ప్రవేశపెట్టి సంక్షేమ పథకాలకు ఆకర్షితులై ఇతర పార్టీల నాయకులు, కార్యకర్తలు బీజేపీలో చేరుతున్నారని మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ తెలిపారు. ఆదివారం ఉదయం తన నివాసంలో తిమ్మాయిపల్లికి చెందిన నాయకులకు ఈటల బీజేపీ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో కావలి నర్సింహ్మా, కొండల్‌రెడ్డి, మేకల రామిరెడ్డి, నాగారం మున్సిపల్ మాజీ చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి, జిల్లా అధ్యక్షుడు బుద్ది శ్రీనివాస్, మాజీ అధ్యక్షుడు విక్రం రెడ్డి, తిరుమల్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా బీజేపీ

ఘట్‌కేసర్ రూరల్, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి) : బీజేపీ సీనియర్ నాయకుడు, ఘట్‌కేసర్ మండల మాజీ అధ్యక్షుడు చలువాది ప్రవీణ్‌రావు సోదరుడు చలువాది గోపాల్ దశదిన కర్మలో ఎంపీ ఈటల రాజేందర్ పాల్గొన్నారు. గోపాల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు బుద్ది శ్రీనివాస్, మండల అధ్యక్షుడు బసవ రాజు గౌడ్, నాయకులు మహిపాల్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, కృష్ణారెడ్డి, లక్ష్మా రెడ్డి, నర్సింహ్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు అభినందనలు


క్రీడాకారులకు చెక్కు అందిస్తున్న ప్రేమ్‌కుమార్ గౌడ్

కేశంపేట, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): కేశంపేట మండలం కొండారెడ్డి పల్లి గ్రామ యువకులైన కె. అరుణ్ తేజ్, పి. చరణ్, ఎస్. జస్వంత్, ఎన్. నందులను అభినందించారు. ఆదివారం నల్గొండ జిల్లా కేంద్రంగా ఈనెల 10, 11(సోమ, మంగళవారాలు)న నిర్వహిస్తున్న అండర్ - 19 ట్రై సిరీస్ చాంపియన్ క్రికెట్ పోటీలకు ఎంపికయ్యారని బీఆర్ఎస్ యువ నాయకుడు ప్రేమ్ కుమార్ గౌడ్ తెలిపారు. ఆమేరకు తన కార్యాయలంలో వారిని అభినందించారు. అలాగే వారికి రూ. 10వేలు నగదు అందజేశారు. రంగరెడ్డి తరఫున ఆడుతున్నారని, మంచి పేరు తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో పల్లె లింగం, కంచుకోట దశరత్, కానం ఉదయ్ కుమార్ గౌడ్, పల్లె భాస్కర్, మాధవ్, శ్రీశైలం, సురేష్, ఆసిఫ్ పాల్గొన్నారు.

ఉచితంగా గంగా జలాల పంపిణీ


జలాన్ని అందజేస్తున్న కోఆర్డినేటర్ సంగమేశ్వరచారి

మోమిన్‌పేట్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): ప్రయాగ్‌రాజ్ మహాకుంభమేళలో స్నానం చేస్తే కోటి జన్మల పుణ్యం లభిస్తుందని భక్తుల ప్రగాఢ విశ్వాసం. అందులో భాగంగా త్రివేణి సంగమంలో స్నానం ఆచరించేందుకు భక్తులు పెద్ద ఎత్తున తరలి వెళ్లారు. అంతటి పవిత్రమైన ప్రదేశానికి వెళ్లలేని వారి కోసం ఆధ్యాత్మిక సేవలో పరితపించేందుకు విశ్వభారత్ మీడియా అరుదైన అవకాశాన్ని కల్పించింది. పవిత్ర త్రివేణి సంగమ నది జలాలను దేశవ్యాప్తంగా అందించేందుకు సంకల్పించిందని విశ్వభారత్ మీడియా తెలంగాణ కోఆర్డినేటర్ మోమిన్‌పేట్‌కు చెందిన కే.సంగమేశ్వరచారి తెలిపారు. ఇప్పటి వరకు దాదాపు వేయి మంది భక్తులకు పవిత్ర గంగానది జలాలను ఉచితంగా పంపిణీ చేయడం జరిగిందన్నారు. మండలంలో పలువురు భక్తులకు ఆదివారం ఆయన జలాలను పంపిణీ చేశారు.

కమీషన్ ఏజెంట్లదే హవా!

సిండికేట్ దందాకు కేరాఫ్‌గా పరిగి వ్యవసాయ మార్కెట్ యార్డు మారింది. లావాదేవీలన్నీ పలువురి కనుసన్నల్లో కొనసాగుతున్నాయి. వారు నిర్ణయించిందే ధర, లేదంటే ఆ ధాన్యం కొనుగోలు చేసేదిక్కుండదు. దీంతో మార్కెట్‌లో అధికారులు డమ్మీగా మారిపోవడంతో పంటలను అమ్మడానికి వచ్చిన రైతులు నిలువుదోపిడీకి గురవుతున్న పరిస్థితి.

- సిండికేట్ దందాకు కేరాఫ్‌గా పరిగి వ్యవసాయ మార్కెట్ యార్డు
- వారు చెప్పిందే రేటు... లేదంటే కొనేదిక్కుండదు
- పట్టించుకోని మార్కెట్ అధికారులు
- కాసుల కక్కుర్తితో దోపిడీకి గురవుతున్న రైతన్న
- నిబంధనలకు విరుద్ధంగా చీకట్లో తూకాలు


మార్కెట్‌లో ఉన్న వేరుశనగ బస్తాలు

పరిగి, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): ఇటీవల వేరుశనగ రైతులు మద్దతు ధరపై రోడ్డెక్కితే కొత్తగా బాధ్యతలు తీసుకున్న చైర్మన్ పరశురాంరెడ్డి మద్దతు ధర కల్పిస్తానని హామీ ఇచ్చారు. ఒక్క వేరుశనగలు.. శుక్రవారానికి బదులుగా మంగళవారమే బీట్లు నిర్వహించారు. అయినా ధర పలక లేదు. చైర్మన్ చొరవ చూపినా మార్పులేదు. ఇంకా ఎక్కువ స్థాయిలో మోసం చేస్తున్నారని రైతులు వాపోయారు. మార్కెట్ యార్డులో 70కిపై లైసెన్స్‌దారులు ఉంటే, ఇందులో బాగా లావాదేవీలు నిర్వహించేది 10 మందిలోపే. 56 మంది కమీషన్ ఏజెంట్లు, 14 మంది ట్రేడర్లు ఉన్నారు. రైతులు తీసుకొచ్చిన పంటలను మార్కెట్ అధికారుల సమక్షంలో పరిశీలించి ధర నిర్ణయించాల్సి ఉంటుంది. కానీ కమీషన్ ఏజెంట్లు నిర్ణయించిన ధరకే ధాన్యం అమ్మాల్సి వస్తోంది. లేదంటే ఎవరూ కొనుగోలు చేయరు. ఆ విధంగా ఏజెంట్ల హవా నడుస్తోంది. అధికారులు వారిచ్చే కమీషన్‌లకు అలవాటుపడి రైతులను నిలువునా మోసం చేస్తున్నా పట్టించుకోవడం లేదు. రైతుల ద్వారా ఆదాయాన్ని ఆర్జించే అధికారులు వారి గురించే పట్టించుకోకుండా వ్యాపారస్తులకు కొమ్ముకాస్తున్నారు. దీంతో మార్కెట్ అక్రమ వ్యాపారానికి కేంద్రంగా మారింది.

ఉదాహరణకు వేరుశనగలు క్వింటాలుకు రూ.5 వేలు నిర్ణయిస్తే అందరూ అదే ధరకు కొనాలి. ఒకవేళ ఎవరైనా సరే ఎక్కువ ధరను పాడితే వారిపై మిగతా ట్రేడర్స్ కలిసి మూకుమ్మడిగా మాటల దాడి చేస్తున్నారు. ఇతర ప్రాంతాల నుంచే వచ్చే ట్రేడర్స్ ఎక్కువ ధరకు కొందామన్నా వీరి బెదిరింపులతో జంకుతున్నారు. ఇక వీరు ఆడిందే ఆటపాడిందే పాటగా కొనసాగుతున్నది. మార్కెట్‌కు వచ్చిన ధాన్యంకు సిండికేట్ ధర నిర్ణయించి వచ్చిన ధాన్యాన్ని ఉన్న నలుగురు ట్రేడర్లు పంచుకుంటున్నారు. ఇదంతా తెలిసినా గానీ మార్కెటింగ్ శాఖ అధికారులు పట్టించుకోవడం లేదు.

అంతా జీరో దందా

పరిగి వ్యవసాయ మార్కెట్‌లో అంతా జీరో దందా కొనసాగుతున్నది. ఇక్కడ కోట్లల్లో లావాదేవీలు జరుగుతుంటే లక్షల్లో చూపిస్తున్నారు. యేటా రూ.3.70 కోట్ల ఆదాయం పొందాలని లక్ష్యం. గత ఏప్రిల్ నుంచి ఇప్పటి వరకు రూ.2.26 కోట్ల ఆదాయం గడిచింది. ప్రభుత్వం నిర్ణయించిన ప్రకారం మార్చి చివరి నాటికి రూ.1.44 కోట్ల ఇన్‌కం రావాలి. ఇప్పుడు సీజన్ కాబట్టి ఒకే నెలలో సాధ్యం. మార్కెట్ నుంచి వే బిల్లులు తీయకుండానే దొంగ వేబిల్లు రశీదులతో కూడా వ్యాపారాలను నిర్వహిస్తున్నారనే ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి.

లైసెన్స్‌లు రద్దు చేస్తాం



నేను చైర్మన్‌గా ఇటీవలే బాధ్యతలు స్వీకరించా. అన్ని పరిశీలిస్తున్నా. ఏ పంట అయినా ప్రభుత్వ ధర కంటే ఎక్కువగానే కొనేలా చర్యలు తీసుకుంటా. రైతులను మోసం చేస్తే ఎంతటివారినైనా సహించం. లైసెన్స్‌లు రద్దు చేస్తాం.

బి.పరశురాంరెడ్డి,
మార్కెట్ కమిటీ చైర్మన్, పరిగి

చీకట్లో తూకాలు

పరిగి మార్కెట్‌లో రైతుల ఎదుటే మోసం చేస్తున్నారు. ఈ సీజన్‌లో మాత్రం శుక్రవారం నిర్ణయించిన ధరకే శని, ఆది, సోమ, మంగళవారాల వరకు కొంటారు. ధాన్యానికి ధరను నిర్ణయించడం పక్కన పెడితే తూకాల్లో కూడా పెద్ద ఎత్తున మోసం చేస్తున్నారు. ఎలక్ట్రానిక్ కాంటాలకు ముందుగానే సెట్టింగ్ మార్చి పెడుతున్నారు. క్వింటాలుకు 10 కిలోల వరకు మోసం చేస్తున్నట్లు తెలుస్తోంది. చీకట్లో తూకాలు చేయొద్దనే నిబంధనలు ఉన్నా తమకేమీ పట్టవు అన్నట్లు వ్యవహరిస్తున్నారు. లైట్లు ఆపేసి అర్ధరాత్రి 11 గంటల వరకు కూడా తూకాలు వేస్తున్నారు.


కవి సత్యంను సన్మానిస్తున్న అతిథులు

అమృత బిందువులు పుస్తకావిష్కరణ

తాండూరు, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): తాండూరు కవి వడిచర్ల సత్యం రచించిన అమృత బిందువులు పుస్తకాన్ని ఆదివారం ఆదిలీలా ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ ఎస్. ఆదినారాయణ, డాక్టర్ ఈటెల సమన్న.. పుస్తకాన్ని ఆవిష్కరించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం భాషా సంస్కృతిక శాఖ, తెలంగాణ సాహిత్య అకాడమీ, తెలంగాణ సంగీత నాటక అకాడమీ, ఆదిలిలా ఫౌండేషన్, తెలుగు సాహిత్య కళ పీఠం, అనంత సాహిత్య సంస్కృతిక వేదిక, ఆధ్వర్యంలో ఢిల్లీలో కార్యక్రమం జరిగింది. 50 మంది కవులు, రెడ్ క్రాస్ సొసైటీ పాండిచరి అధ్యక్షుడు డాక్టర్ లక్ష్మీపతి, తెలుగు సాహిత్య ప్రధాన పీఠం కార్యదర్శి పట్వాల అశోక్, శతవధాని డాక్టర్ మలుగు అంజయ్య, కవి కోటం చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

మందకృష్ణ పోరాటంతోనే వర్గీకరణకు ఆమోదం

పరిగి, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): మందకృష్ణ పోరాట ఫలితంగానే ఎస్సీ వర్గీకరణను తెలంగాణ ప్రభుత్వం ఆమోదించిందని మాదిగ టీచర్స్ ఫెడరేషన్ సభ్యులు తెలిపారు. ఆయన్ను ఆదివారం నగరంలోని తాజ్‌దక్కన్ హోటల్‌లో కలిశారు. 11 శాతం రావాల్సి ఉండగా, తొమ్మిది శాతాన్ని ఇవ్వడాన్ని కూడా స్వాగతిస్తున్నామని పరిగి టీఎంటీఎఫ్ అధ్యక్షకార్యదర్శులు కె.వెంకటయ్య, టి.నరేందర్‌లు తెలిపారు. త్వరలో 11శాతానికి పెంచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మందకృష్ణను కలిసినవారిలో సంఘం నాయకులు లాలయ్య, బిచ్చయ్య, వెంకటయ్య, నరేందర్, నర్సింహారాజు, బి.సుధాకర్, లక్ష్మీనర్సింహులు, పి.శ్రీనివాస్, వెంకటప్రసాద్, బందెయ్యలు ఉన్నారు.

ముదిరాజ్‌లు అన్ని రంగాల్లో రాణించాలి

- ఎమ్మెల్యే వీరపల్లి శంకర్
- ఘనంగా పండుగ సాయన్న, జ్యోతీరావు పూలే విగ్రహావిష్కరణ


అభివాదం వ్యక్తం చేస్తున్న ఎమ్మెల్యే, నాయకులు

షాద్‌నగర్ రూరల్, ఫిబవరి9(ఆంధ్రజ్యోతి): మహనీయులను ఆదర్శంగా తీసుకుని ముదిరాజ్‌లు అన్ని రంగాల్లో రాణించాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తెలిపారు. ఫరూఖ్‌నగర్ మండలం మహల్ ఎలికట్ట గ్రామ ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పండుగ సాయన్న, మహాత్మా జ్యోతీరావు పూలే విగ్రహాల ఆవిష్కరణకు ఆదివారం ఆయన హాజరయ్యారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ, పండుగ సాయన్న నాడు పేద ప్రజల కోసం పాటుపడ్డారని గుర్తు చేసుకున్నారు. ఆయన జీవితం ప్రజల కోసం త్యాగం చేశారని తెలిపారు. ముదిరాజ్ బిడ్డగా ఆయన పుట్టడం అదృష్టమని తెలిపారు. గ్రామంలో మహనీయుల విగ్రహాలు పెట్టుకోవడం మంచి సంప్రదాయమని తెలిపారు. రాష్ట్ర ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ బుర్రా జ్ఞానేశ్వర్ మాట్లాడుతూ గత పాలకులు ముదిరాజ్‌లను గుర్తించ లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఈ వర్గీయులకు అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ముదిరాజ్‌లను విడదీయాలని చూస్తారన్నారు. అటువంటి ప్రయత్నాలకు లొంగకూడదని అన్నారు. కాంగ్రెస్ నాయకులు నీలం మధు మాట్లాడుతూ రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసి గెలుపొందాలని సూచించారు. బీసీల జనాభాలో ముదిరాజ్‌లు అధికంగా ఉన్నారని తెలిపారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందె బాబయ్య మాట్లాడుతూ ముదిరాజ్‌లు అందరూ కూడా ఏకం కావాలని పిలుపునిచ్చారు. గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ తలారి మల్లేష్, స్థానిక నాయకులు శ్రీశైలం ముదిరాజ్, బుడ్డ నర్సింహ్మ, తుమ్మలపల్లి కృష్ణయ్య, మంగ వెంకటేష్, అంచె రాములు పాల్గొన్నారు.

కాంగ్రెస్ మాటే శాసనం

నందిగామ : కాంగ్రెస్ మాట ఇస్తే తప్పదు అని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. ఎస్సీ వర్గీకరణ, బీసీ కులగణన అసెంబ్లీలో ఆమోదం పొందిన సందర్భంగా నందిగామలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జంగ నర్సింహులు ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా డప్పు వాయిద్యాలతో, డీజే పాటలతో ర్యాలీ నిర్వహించారు. ఎమ్మెల్యేకు గజమాలతో కాంగ్రెస్ కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు.

రైతులను ఆదుకుంటాం

- ఏకకాలంలో రూ.2లక్షలు రుణమాఫీ చేసిన ఘనత కాంగ్రెస్‌దే
- ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

యాచారం, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : రైతులను తమ ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి చెప్పారు. దేశంలో ఎక్కడాలేని విధంగా రాష్ట్రంలో ఏకకాలంలో రైతులకు రూ.2లక్షల రుణమాఫీ చేసిన ఘనత సీఎం రేవంత్‌రెడ్డిదేనన్నారు. ఆదివారం యాచారంలో రూ.77.50 లక్షలతో నిర్మించిన ఎరువుల గోదాంను ప్రారంభించారు. అనంతరం జరిగిన సభలో ఆయన మాట్లాడారు. సొసైటీ ముందు దుకాణ సముదాయ కాంప్లెక్స్, ప్రహరీ నిర్మాణం కోసం నిధులు ఇచ్చి ఆదుకుంటామన్నారు. రైతులను సకాలంలో ఎరువులు, రుణాలు అందించి ఆదుకోవడం అభినందనీయమన్నారు. దుకాణసముదాయం నిర్మిస్తే సొసైటీకి ఆదాయం వస్తుందని చెప్పారు. గత పాలకులు ఇక్కడ ఫార్మాసిటీ తెచ్చి రైతులను రోడ్డున పడేశారన్నారు. తాము ఇచ్చిన మాట ప్రకారంగా రద్దు చేశామన్నారు. ఫార్మాసిటీ అంశంలో ప్రభుత్వంపై నిందలు వేయడం మంచిదికాదన్నారు. యాచారం మండలాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేయడానికి ప్రత్యేక చొరవ తీసుకుంటున్నట్లు వెల్లడించారు. యువతకు ఉపాధి కల్పించడానికి ఉన్నతాధికారులతో మాట్లాడుతున్నట్లు వెల్లడించారు. యాచారం సొసైటీని జిల్లాలో ఆదర్శ సొసైటీగా మార్చడానికి తాను చర్యలు తీసుకుంటున్నట్లు డీసీసీబీ చైర్మన్ కొత్తకురుమ సత్తయ్య చెప్పారు. ప్రహరీ కోసం రూ.25లక్షల నిధులు కేటాయిస్తున్నట్లు వెల్లడించారు. సమావేశంలో సొసైటీ చైర్మన్ టి.రాజేందర్ రెడ్డి, వైస్ చైర్మన్ కారింగ్ యాదయ్య, ఇబ్రహీంపట్నం మార్కెట్ కమిటీ చైర్మన్ గురునాథ్‌రెడ్డి, బీఎన్‌రెడ్డి ట్రస్ట్ చైర్మన్ బిలకంటి చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ చైర్మన్ నాయిని సుదర్శన్‌రెడ్డి తదితరులున్నారు.

క్రీడాప్రాంగణాలు .. నిరుపయోగం!


బషీరాబాద్ మండలం కంసాన్‌పల్లి(ఎం)లో క్రీడా ప్రాంగణం ఇలా

బషీరాబాద్, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో యువకులు, విద్యార్థులు ఆడుకోవడానికి వీలుగా ప్రభుత్వం ప్రతీగ్రామంలో నిర్మించిన పల్లె క్రీడాప్రాంగణాలు నిరుపయోగంగా మారాయి. ఈ క్రమంలో మండల వ్యాప్తంగా 36 గ్రామ పంచాయతీల్లో ప్రాంగణాలు ఏర్పాటు చేశారు. వీటి నిర్వహణ సరిగా లేకపోవడంతో దాదాపు అన్ని గ్రామాల ప్రాంగణాలు పిచ్చిమొక్కలు, కంప చెట్ల పొదలతో నిండి అస్తవ్యస్తంగా తయారయ్యాయి. క్రీడాల కోసం ఆట వస్తువులు పంపిణీ చేసిన కనిపించడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఘనంగా మల్లన్న బోనాలు



షాబాద్ మండలం వెంకమ్మగూడ గ్రామంలో మల్లన్న కల్యాణం ఆదివారం భక్తిశ్రద్ధలతో జరిపారు. ఈ సందర్భంగా మహిళలు బోనాలు సమర్పించారు. అంతకుముందు శివసత్తుల పూనకాలు, పోతరాజుల విన్యాసాల నడుమ ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. అనంతరం మొక్కులు చెల్లించారు. గ్రామస్తులు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. షాబాద్, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి)

పాలకవర్గం ఏర్పాటు ఎప్పుడో?

- మహేశ్వరం మార్కెట్ చైర్మన్ పదవి ఎస్టీ జనరల్‌కు కేటాయింపు
- ఆశావహుల మధ్య నెలకొన్న తీవ్ర పోటీ
- జాప్యంతో కాంగ్రెస్ నేతలకు శిరోభారంగా మారిన వ్యవహారం



వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయం

మహేశ్వరం, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని అన్నట్లుగా ఉంది మహేశ్వరం మార్కెట్ కమిటీ పాలకవర్గం పరిస్థితి. రంగారెడ్డి జిల్లాలో ఉన్న మిగతా మార్కెట్ కమిటీల పాలక వర్గాలు ఏర్పాటై ప్రమాణ స్వీకారానికి సన్నద్ధమవుతుండగా ఈ మార్కెట్ కమిటీ పాలకవర్గ నియామకంలో ఇంకా జాప్యం ఎందుకు జరుగుతుందోనని తెలియక అధికార కాంగ్రెస్ నేతలు తలలు పట్టుకుంటున్నారు. సంవత్సర కాలంగా పాలక వర్గం లేక రైతులకు అందాల్సిన పలురకాల సేవలు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. అనేక రకాల ఇబ్బందులు ఎదుర్కోక తప్పడంలేదు. మార్కెట్ కమిటీ పాలక వర్గం ఎప్పుడు ఏర్పాటు చేస్తారోనని ఎదురు చూస్తున్నారు.

త్వరగా ఏర్పాటు చేయాలని మహేశ్వరం, కందుకూరు మండలాల రైతులు మహేశ్వరం కాంగ్రెస్ ఇన్‌చార్జి కేఎల్ఆర్‌తో పాటు పలువురు అధికార పార్టీ నేతలను ఆశ్రయిస్తున్నారు. ఇదిలా ఉండగా మహేశ్వరం మార్కెట్ కమిటీ రిజర్వేషన్లను అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం 2015 - 16 లోనే ఐదు విడతలుగా ఒకేసారి లాటరీ పద్ధతిన ప్రకటించింది. ఇబ్రహీంపట్నం మార్కెట్ కమిటీ నుంచి 2015 లో విడిపోయి మహేశ్వరం మార్కెట్ కమిటీ నూతనంగా ఏర్పాటైంది. దీనికి రెండు పర్యాయాలు జనరల్ మహిళ, మూడో విడత జనరల్, నాలుగో విడత ఎస్టీ జనరల్, ఐదో విడత జనరల్ మహిళకు రిజర్వేషన్‌లు కేటాయించారు. ప్రస్తుతం కొలువుదీరనున్న మహేశ్వరం మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ ఎస్టీ జనరల్‌కు రిజర్వేషన్ కావడంతో కందుకూరు, మహేశ్వరం మండలాలకు చెందిన అధికార పార్టీ కాంగ్రెస్ నాయకులు చైర్‌పర్సన్ కోసం కాంగ్రెస్ పెద్దలను ప్రసన్నం చేసుకునే పనిలో ఉంటూ పార్టీ కోసం తాము చేసిన కృషిని వివరిస్తున్నారు. ఆ మేరకు ఎవరి ప్రయత్నాల్లో వారు చేస్తున్నారు.

మూడు విడతలు కందుకూరుకేనా?

మహేశ్వరం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవిని మూడు విడతలుగా కందుకూరు మండలానికి చెందిన నేతలకే కేటాయించారు. ఈసారి మహేశ్వరం మండలానికి చెందిన నాయకులకే పదవి వరించనుందని ప్రచారం జరిగింది. ప్రస్తుతం కందుకూరు మండలానికి చెందిన నాయకునికే కేటాయిస్తారనే ప్రచారంలో ఉంది. కాగా మహేశ్వరం మండల గిరిజన కాంగ్రెస్ నేతలు విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. కందుకూరు మండలానికి చెందిన కృష్ణానాయక్ ను చైర్మన్ గా ప్రకటిస్తున్నట్లు మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్ కొన్ని సందర్భాల్లో ప్రకటించినట్టే ప్రకటించి ఇప్పుడు ఈ ఫైల్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్‌బాబు వద్ద ఉందనే ప్రచారం సాగుతోంది.

రేసులో ఉన్న నేతలు

మహేశ్వరం మండలానికి చెందిన అంగోత్ కృష్ణానాయక్, నేనావత్ రాజునాయక్, పాండునాయక్, అంద్యానాయక్, రాములునాయక్‌లు ఉండగా కందుకూరు మండలం నుంచి అంజనేయులునాయక్, లచ్చానాయక్, కృష్ణానాయక్‌లు చైర్మన్ పదవి కోసం తీవ్రంగా పోటీ పడుతున్నారు. కృష్ణానాయక్, రాజునాయక్‌లు నువ్వా నేనా అనే రీతిలో కాంగ్రెస్ అధిష్టానం వద్ద ముమ్మర ప్రయత్నాలు చేశారు. కానీ, పాలక వర్గం ఏర్పాటులో మాత్రం కేఎల్లార్ కాలయాపన చేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. కాగా, మార్కెట్ కమిటీ చైర్మన్ గా కృష్ణానాయక్ పేరు దాదాపుగా ఖరారు అయిందనే వార్తలు వినిపించాయి. అయితే ఆయన కొన్ని సందర్భాల్లో సొంత పార్టీ నాయకులపై విమర్శలు గుప్పించారని దీంతో మళ్లీ చైర్మన్ నియామకం వాయిదా పడినట్లు సమాచారం.

వేలం ద్వారా రూ. 2.15 లక్షల ఆదాయం

తలకొండపల్లి, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మల్లప్ప గుట్ట మల్లికార్జున స్వామి ఆలయంలో ఆదివారం వివిధ విక్రయాలకు వేలంపాట నిర్వహించారు. శివరాత్రి బ్రహ్మోత్సవాల నేపథ్యంలో నిర్వహించిన కొబ్బరికాయలు, లడ్డూ, పులిహోర, తలనీలాలు, శీతలపానియాలు, అల్పాహారం, టీ అమ్మకాలకు వేలంపాట పాడారు. కొబ్బరికాయల విక్రయం టెండర్‌ను రూ.1.50 లక్షలకు, పులిహోర, లడ్డూ వేలం రూ.65 వేలకు మైసిగండికి చెందిన కిషన్‌నాయక్ దక్కించుకున్నారు. ఆయా టెండర్ల ద్వారా రూ.2.15 లక్షలు ఆదాయం సమకూరిందని, ఆ నిధులను ఆలయ అభివృద్ధికి ఖర్చు చేస్తామని ఆలయ నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ఏమిరెడ్డి కౌసల్య, నిర్వాహకులు పెంటారెడ్డి, మల్లారెడ్డి, నారాయణ రెడ్డి, మల్యానాయక్, శేఖర్ రెడ్డి, చందు, రాజు, రామాంజనేయులు, యాదగిరి, ఈదప్పరెడ్డి, ఆమనగల్లు మార్కెట్ మాజీ చైర్మన్ నాలాపురం శ్రీనివాస్ రెడ్డి, మార్కెట్ మాజీ డైరెక్టర్ రమేశ్‌నాయక్, మాజీ సర్పంచ్ స్వప్నభాస్కర్ రెడ్డి, నాయకులు రామకృష్ణ, దామోదర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఫీడర్ పనులు ప్రారంభం


పనులను ప్రారంభిస్తున్న ఏఈ, గ్రామస్తులు

మొయినాబాద్, ఫిబ్రవరి 9, (ఆంధ్రజ్యోతి): మండలంలోని నక్కలపల్లి గ్రామానికి విద్యుత్ సరఫర కోసం ప్రత్యేక ఫీడర్ ఏర్పాటు చేయనున్నారు. ఆదివారం విద్యుత్ ఏఈ ఆమూనాయక్ పనులు ప్రారంభించారు. ఏళ్లుగా విద్యుత్ సమస్యతో సతమతమవుతున్నామని, ప్రత్యేక ఫీడర్ ఏర్పాటుతో తమ సమస్యలు తీరుతాయని గ్రామస్తులు తెలిపారు. కార్యక్రమంలో గ్రామస్తులు అంజయ్యగౌడ్, నిరంజన్‌గౌడ్, మల్లారెడ్డి, భీమయ్య, దర్శన్‌రెడ్డి, ఖలీల్, రాజు, శ్రీకాంత్, సాబేర్, రవి, ప్రవీన్, మధు ఉన్నారు.

14న మెగా వైద్యశిబిరం

ఆమనగల్లు, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): ఆమనగల్లు పట్టణంలోని శ్రీ సత్య ఆస్పత్రి వద్ద ఈనెల14న ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు డాక్టర్ శ్రీనివాస్ ఆదివారం ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్ మెడ్ సిటీ ఆస్పత్రి సహకారంతో శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. శిబిరంలో ఉచితంగావైద్య పరీక్షలు నిర్వహిస్తామని, ఈ అవకాశాన్ని ఆమనగల్లు మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మార్మోగిన శివనామస్మరణ

కొత్తూర్, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీలోని తిమ్మాపూర్ వద్ద గల శ్రీ హనుమాన్ ఆలయంలో మల్లాపూర్ గ్రామానికి చెందిన పిన్నింటి శ్రీలతాసుభాష్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం ద్వాదశ జ్యోతిర్లింగ మహా పడిపూజ వైభవంగా జరిగింది. గురుస్వామి పులిజాల సత్యనారాయణ ఆధ్వర్యంలో మహాపడిపూజ నిర్వహించగా, వేలాది మంది శివస్వాములు హాజరయ్యారు. శివస్వాములు నిర్వహించిన భజనలు, భక్తి పాటలతో హనుమాన్ ఆలయ ప్రాంగణం శివనామస్మరణతో మార్మోగింది. మహాపడిపూజ సందర్భంగా మండపాన్ని అందంగా ముస్తాబు చేశారు. ఆయా ప్రాంతాలకు చెందిన భక్తులు పూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం అన్నదాన చేశారు. కార్యక్రమంలో కొత్తూర్ మాజీ ఎంపీపీ మధుసూదన్‌రెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్లు కోస్గి శ్రీనివాస్, చింతకింది చంద్రకళరాజేందర్‌గౌడ్ పాల్గొన్నారు.

దివ్యాంగులకు బస్ పాస్‌లు అందజేత

శంషాబాద్ రూరల్ ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పిల్లోనిగూడకు చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జుర్కి రమేశ్‌పటేల్ గ్రామానికి చెందిన 25 మంది దివ్యాంగులకు ఆదివారం పంచాయతీ కార్యాలయం వద్ద బస్‌పాస్‌లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తన వంతు సహాయంగా సొంతఖర్చులతో బస్ పాసులు అందజేసినట్లు తెలిపారు. మున్ముందు మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడుతానని చెప్పారు. కార్యక్రమంలో ఆర్టీసీ అధికారి రాజు, గ్రామస్తులు వీరాచారి, భీష్మ, కిష్టయ్య, మల్లేష్, లింగం, శ్రీనివాస్, సంతప్ భాను పాల్గొన్నారు..

బీజేపీకి తిరుగులేని విజయం

చేవెళ్ల, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): బీజేపీ తోనే అభివృద్ధి సాధ్యమని, ఢిల్లీలో తిరుగులేని విజయం సాధించడం సంతోషంగా ఉందని పార్టీ చేవెళ్ల మండల అధ్యక్షుడు అత్తెల్లి అనంతరెడ్డి తెలిపారు. చేవెళ్లలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ... 26 సంవత్సరాల తర్వాత ఢిల్లీలో బీజేపీ ప్రభుత్వం కొలువు దీరనుందన్నారు. ఢిల్లీ ప్రజలు ఇచ్చిన తీర్పు బీజేపీ శ్రేణుల్లో ఆనందన్ని నింపిందన్నారు. ఆప్ ప్రభుత్వంపై అనేక అవినీతి ఆరోపణలు రావడంతో ప్రజలు ఆ ప్రభుత్వాన్ని తిరస్కరించారని చెప్పారు. బీజేపీ ఢిల్లీలోనే కాదు తెలంగాణలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రాష్ట్రంలో సీఎం రేవంత్‌రెడ్డి సర్కార్ పట్ల ప్రజలు విశ్వాసం కోల్పోయారని ఆరోపించారు.

ప్రైవేటు హాస్టళ్లలో భద్రతేదీ?

(5వ పేజీ తరువాయి)

హాస్టళ్లలో నిబంధనల ప్రకారం మహిళా వార్డెన్‌లు ఉండాలి. కానీ పురుషులే బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

నిబంధనలివే...

ప్రతీహాస్టల్‌ను తప్పనిసరిగా మున్సిపల్ ఆఫీస్‌లో రిజిస్టర్ చేయించాలి. రక్షణ కోసం సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి. మున్సిపల్, పోలీస్, ఫైర్, లేబర్ కార్యాలయాల నుంచి నిరభ్యంతర(ఎన్‌ఓసీ) పత్రం తీసుకోవాలి. మహిళా హాస్టలైతే మహిళా వాచ్‌మెన్, బాయ్స్ హాస్టలైతే పురుష వాచ్‌మెన్‌ను నియమించుకోవాలి. విద్యార్థినులను కలిసేందుకు కుటుంబ సభ్యులు సూచించిన వారికే అనుమతివ్వాలి. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. హాస్టల్ పరిధిలో ర్యాగింగ్ లాంటివి చేయరాదు. ఫస్ట్ ఎయిడ్ కిట్, అత్యవసరమైన మాత్రలు అందుబాటులో ఉండాలి. 100 డయల్, షీటీం నంబర్లను అందరికీ కనిపించేలా ప్రదర్శించాలి.

లైసెన్స్‌లు తీసుకోవాల్సిందే



మున్సిపాలిటీ పరిధిలో 150 పైగా హాస్టళ్ల ఉన్నాయి. వీటికి ఎలాంటి అనుమతులు లేవు. ఇప్పటికైనా ప్రైవేటు హాస్టల్ నిర్వాహకులు ట్రేడ్ లైసెన్స్, ఫైర్ సేఫ్టీ సర్టిఫికెట్ ఇతర ఎన్‌ఓసీ పత్రాలు తీసుకొని హాస్టల్స్ నడిపించుకోవాలి. లేకుంటే నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకుంటాం.

- బాలకృష్ణ, ఆదిభట్ల మున్సిపల్ కమిషనర్

నిబంధనలు పాటించాలి



ప్రైవేటు హాస్టల్స్ నిర్వాహకులు కచ్చితంగా సీసీ కెమెరాలు, వాచ్‌మెన్, పార్కింగ్ వంటి సౌకర్యాలు ఏర్పాటు చేసుకోవాలి. హాస్టల్స్ ఉండే విద్యార్థుల డేటా, ఆధార్ కార్డు తప్పనిసరిగా నిర్వాహకుల దగ్గర ఉండాలి. గేట్ వద్ద రిజిస్టర్ మెయింటెన్ చేయాలి. నిబంధనల మేరకు హాస్టల్స్ ఏర్పాటు చేసుకోవాలి.

- కేపీవి రాజు, ఏసీపీ ఇబ్రహీంపట్నం

కొనసాగింపా.. ప్రత్యేకమా..?

(5వ పేజీ తరువాయి)

ఈనెల 15తో ముగియనుంది. పదవీ కాలం మరో ఏడు రోజులు మాత్రమే మిగిలి ఉంది. నిబంధనల ప్రకారం పీఏసీఎస్‌లకు ఎన్నికలను నిర్వహించాలి. ఆయా సంఘాలకు డైరెక్టర్లు, చైర్మన్లను ఎన్నుకోవాలి. ఎలాంటి అడ్డంకులు లేకుండా ఈ ప్రక్రియ పూర్తి కావాలంటే తక్కువలో తక్కువ కనీసం నెల రోజులు ముందుగానే నోటిఫికేషన్ విడుదల చేయాల్సి ఉంటుంది. గతంలో జరిగిన ఎన్నికలను చూస్తే ఇప్పటికే నోటిఫికేషన్ జారీ కావాల్సి ఉంది. ఈ మేరకు ఓటరు జాబితాను విడుదల చేసి గ్రామ పంచాయతీల్లో అతికించాలి. అందులో ఏమైనా అభ్యంతరాలు ఉంటే చేర్పులు మార్పులు చేసి తుది జాబితా వెల్లడించాలి. ఈ ప్రక్రియ నడుస్తుండగానే అధికారులు ఎన్నికలకు సిద్ధం చేస్తుంటారు. ఇవేవి జరుగుతున్న దాఖలాలు లేవు. దీనిని బట్టి ఇప్పట్లో సహకార సమరం జరిగే అవకాశాలు కనిపించడం లేదని ప్రచారం జరుగుతోంది. ప్రభుత్వం ఇప్పటికే గ్రామ పంచాయతీ, మండల, జిల్లాపరిషత్ ఎన్నికల మాదిరిగానే సహకార సంఘాల ఎన్నికలు కూడా వాయిదా వేసే అవకాశం ఉందని స్థానికంగా చర్చ జరుగుతోంది. అయితే ప్రభుత్వం ఎన్నికలు నిర్వహిస్తుందా? పర్సన్ ఇన్‌చార్జిలను నియమిస్తుందా? ప్రస్తుతం ఉన్న పాలక వర్గాల పదవీ కాలాన్ని పొడిగిస్తుందా? అనేది చర్చనీయంశంగా మారింది.

స్థానిక ఎన్నికల తరువాతే..

సహకార సంఘాల పాలకవర్గాల పదవీ కాలం ఫిబ్రవరి 15వ తేదీన ముగియనుంది. అయితే ఎన్నికలు వాయిదా పడే అవకాశం ఉందని సహకార సంఘాల వర్గాలు భావిస్తున్నాయి. అదేజరిగితే ప్రభుత్వం పీఏసీఎస్‌లకు పర్సన్ ఇన్‌చార్జిలను నియమించే అవకాశం ఉంది. పర్సన్ ఇన్‌చార్జిలు ప్రస్తుతం ఉన్న సహకారం సంఘాల బాధ్యులను, లేదంటే ప్రత్యేకాధికారులను నియమించే అవకాశం ఉంది. అయితే ఇప్పటివరకు ప్రభుత్వం నుంచి స్పష్టత లేదు. స్థానిక ఎన్నికలు త్వరలో నిర్వహించేలా ప్రభుత్వం కసరత్తు చేస్తుండటంతో పీఏఎస్ ఎన్నికలు వాయిదాపడే అకాశాలు కనిపిస్తున్నాయి.

కొత్తగా 11 పీఏసీఎస్‌లు

ప్రస్తుతం ఉన్న 38 పీఏసీఎస్‌లకు తోడుగా.. కొత్తగా మరో 11 సహకార సంఘాలను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు సహకార శాఖ కమిషన్ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లోనూ కొత్తగా ఏర్పాటు చేసే పీఏసీఎస్‌ల ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశాలు జారీ చేసింది. సహకార శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జిల్లాలో ప్రస్తుతం ఉన్న పీఏసీఎస్‌ల పరిధిలో కొత్తగా ఏర్పాటుచేయనున్న సంఘాల జాబితాను ప్రభుత్వానికి నివేదిక రూపంలో పంపింది.

దైవ చింతనతో మానసిక ప్రశాంతత


పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, పల్లె ఆనంద్ కుమార్

కేశంపేట, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): దైవ చింతనతో మానసిక ప్రశాంతత కలుగుతుందని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. మండల పరిధిలోని పోమాల్‌పల్లి, కొండారెడ్డిపల్లి గుట్టపై వెలసిన లక్ష్మీ వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల పోస్టర్‌ను క్యాంపు కార్యాయలంలో ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవుని ఉత్సవాలు గ్రామంలో అందురూ కలిసి జరుపుకోవాలని సూచించారు. అంతకుముందు పల్లె ఆనంద్‌కుమార్, నిదురం కృష్ణయ్య ఎమ్మెల్యేకు బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికనందించారు. ఉత్సవాలకు హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్ కరుణాకర్, దర్శన్, ఆలయ కమిటీ సభ్యులు సత్యనారాయణ, గోవర్ధన్ రెడ్డి, బండ మల్లేష్, శ్రీనివాస రావు, బుర్రి మల్లేష్ గౌడ్, నర్సింహులు గౌడ్, అనిల్‌కుమార్ గుప్త, లింగం, కరుణాకర్, శ్రీనివాస్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నేటి ధర్నాను విజయవంతం చేయాలి


ఆమనగల్లు: మాట్లాడుతున్న పెంటయ్య

ఆమనగల్లు, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రైతు, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తుందని సీఐటీయూ ఆమనగల్లు ఏరియా కన్వీనర్ పెంటయ్య ఆరోపించారు. కేంద్ర బడ్జెట్‌ను వ్యతిరేకిస్తూ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో సోమవారం హైదరాబాద్ ఇందిరాపార్క్ వద్ద ప్రజా సంఘాల ఆధ్వర్యంలో మహాధర్నా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆమనగల్లు పట్టణంలో ఆదివారం సీఐటీయూ సమావేశం నిర్వహించారు. సమావేశానికి పెంటయ్య హాజరై కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు తీవ్ర అన్యాయం జరిగిందని ఆరోపించారు. కేంద్ర బడ్జెట్ సంపన్న వర్గాలకు మేలు చేసేలా ఉందని పేర్కొన్నారు. మహాధర్నాకు ఆమనగల్లు, కడ్తాల, మాడ్గుల, తలకొండపల్లి మండలాల నుంచి కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో రమేశ్, ఆశీర్వాదం, పాండు, పర్వతాలు, లక్ష్మణ్ నాయక్, చత్రునాయక్, లక్ష్మణ్, రాములు, మహేశ్, జంగయ్య, భిక్షపతి పాల్గొన్నారు.

చేవెళ్ల: బడ్జెట్‌లో తెలంగాణకు జరిగిన అన్యాయాన్ని నిరసిస్తూ ఈ నెల 10వ తేదీన చలో ఇందిరాపార్కు కార్యక్రమం సీపీఎం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు సీపీఎం చేవెళ్ల డివిజన్ అధ్యక్షుడు అల్లి దేవేందర్ తెలిపారు. ఆదివారం ఆయన చేవెళ్లలో మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో తెలంగాణకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. ఇందిరాపార్కు వద్ద జరిగే ధర్నాకు డివిజన్ నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలి వచ్చి విజయవంతం చేయాలని కోరారు.

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి


ఉపాధ్యాయులను సన్మానిస్తున్న పీఆర్‌టీయూ నాయకులు

శంకర్‌పల్లి, ఫిబ్రవరి9(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల సమస్యలపై నిరంతరం పోరాడిన ఘనత పీఆర్‌టీయూ సంఘానికే దక్కిందని శంకర్‌పల్లి మండల అధ్యక్షుడు మాణిక్యం అన్నారు. పీఆర్‌టీయూ ఉపాధ్యాయ సంఘ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని శంకర్‌పల్లి మండల వనరుల కేంద్రం వద్ద ఆదివారం సంఘం జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులకు రావాల్సిన ఐదు డీఏలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సీపీఎస్ రద్దుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ఉద్యోగ విరమన చేసిన మాజీ ఎంఈఓ సురేష్, ఉపాధ్యాయులు సత్తయ్య, ప్రభాకర్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, శ్రీశైలం, బుచ్చయ్యలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంఈఓ అక్బర్, అసోసియేట్ అధ్యక్షుడు రాములు, ఆరీఫ్‌పాషా, గౌరవాధ్యక్షుడు రాములు, మర్పల్లి మండల అధ్యక్షుడు ప్రేమ్ కుమార్ ఉన్నారు.

కొనసాగుతున్న ఆలయ బ్రహ్మోత్సవాలు


ధ్వజారోహణంలో భక్తులు

కడ్తాల్ , ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): కడ్తాల మండల కేంద్రంలోని లక్ష్మీచెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాలు కనులపండువగా కొనసాగుతున్నాయి. వార్షిక బ్రహ్మోత్సవాల నేపథ్యంలో ఆలయాన్ని పచ్చటి తోరణాలు, పుష్పాలతో శోభాయమానంగా అలంకరించారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి మొక్కులు తీర్చుకుంటున్నారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండో రోజు ఆదివారం అర్చకులు వెంకటేశ్వర శర్మ, శ్రీధర్, నర్సింహమూర్తి, శ్రీమన్నారాయణ, వేణుగోపాల్ ఆధ్వర్యంలో ధ్వజారోహణం, ప్రత్యేక పూజలు, లలితాసహస్ర పారాయణం, ఎదుర్కోళ్ల కార్యక్రమాలు నిర్వహించారు. సోమవారం నిర్వహించే కల్యాణోత్సవానికి ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ పాలాదీ ఆంజనేయులు, మాజీ సర్పంచ్ గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి, మాజీ ఎంపీటీసీ గూడూరు శ్రీనివాస్ రెడ్డి, ఉత్సవ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో భారీ ఏర్పాట్లు చేశారు. బ్రహ్మోత్సవాలలో డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ పాల్గొని స్వామి వారికి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు, భక్తులు కడారి రామకృష్ణ, నరేందర్ రెడ్డి, సాయిరెడ్డి, బ్రహ్మచారి, చేగూరి వెంకటేశ్, వెంకట్ రెడ్డి, యాదగిరి రెడ్డి, రాఘవేందర్, భిక్షపతి పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



చౌదరిగూడ, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): జిల్లేడ్ చౌదరిగూడ జెడ్పీహెచ్‌ఎస్‌లో ఆదివారం 2009-10 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎక్కడెక్కడో స్థిరపడిన వారంతా ఒక చోటుకు చేరి గత స్మృతులను నెమరువేసుకున్నారు. అప్పటి గురువులు నేర్పిన క్రమశిక్షణ, చదువుతో ఈరోజు ఈ స్థాయిల్లో ఉన్నామని తెలిపారు. అనంతరం గురువులను సన్మానించారు. పాఠశాలకు పూర్వ విద్యార్థులు వాటర్ క్యాన్‌లను అందించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నర్సింహులు, వెంకటేష్, సునీత, విజయలక్ష్మి, మహమూద్ అలీ, మల్లేష్ పాల్గొన్నారు.

సమష్టి కృషితోనే అభివృద్ధి


పనులను ప్రారంభిస్తున్న నాయకులు

కడ్తాల్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): సమష్టి కృషితోనే అభివృద్ధి సాధ్యమని పలువురు నాయకులు పేర్కొన్నారు. అభివృద్ధిలో రాజకీయాలకు చోటు లేకుండా ప్రజలంతా పాలుపంచుకోవాలని కోరారు. కడ్తాల మండలం ముద్విన్ గ్రామంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ద్వారా ఎస్సీ సబ్ ప్లాన్ నిధుల నుంచి మంజూరైన రూ.15 లక్షలతో చేపట్టే సీసీ రోడ్లు, అంతర్గత మురుగు కాల్వ నిర్మాణ పనులను ఆదివారం స్థానిక నాయకులు ప్రారంభించారు. నిధులు మంజూరు చేయించిన ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రాంచంద్రయ్య, మాజీ ఎంపీటీసీ యాదయ్య, నాయకులు నక్కపోతు మధు, నర్సింహ్మ, సురేందర్ రెడ్డి, శ్రీశైలం, నర్సింహ, గంట నరేశ్, మల్లేశ్ ఉన్నారు.

గట్టిప్పలపల్లిని మండలం చేయాలి


మాట్లాడుతున్న తల్లోజు ఆచారి

ఆమనగల్లు, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): ప్రజల అభీష్టం, ఆలోచనా విధానాలకు అనుగుణంగా ప్రభుత్వం నిర్ణయాలు తీసుకోవాలని జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు, బీజేపీ రాష్ట్ర నాయకుడు తల్లోజు ఆచారి కోరారు. పాలనా సౌలభ్యం కోసం తలకొండపల్లి మండలం గట్టిప్పలపల్లి గ్రామాన్ని మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలని కోరారు. దీని కోసం జేఏసీ నాయకులు, గ్రామస్తులు చేపట్టిన దీక్షలు 100వ రోజుకు చేరిన సందర్భంగా శనివారం రాత్రి ధూందాం నిర్వహించారు. వివిధ పార్టీలు, సంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆచారి జేఏసీ నాయకులకు సంఘీభావం ప్రకటించారు. తొమ్మిది గ్రామ పంచాయతీలను కలిపి గట్టిప్పలపల్లిని మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలని, జిల్లాల పునర్విభజన, కొత్త మండలాల ఏర్పాటు సందర్భంగా తాను అప్పటి ప్రభుత్వాన్ని కోరానని పేర్కొన్నారు. కల్వకుర్తిలో ఆర్డీవో కార్యాలయం ఏర్పాటుకు తాను నిరాహార దీక్ష చేపట్టిన సందర్భంలో ఈ విషయాన్ని ప్రస్తావించానని పేర్కొన్నారు. సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకుపోయి మండల కేంద్రం ఏర్పాటుకు తన వంతు కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు అశోక్, ఆంజనేయులు, శరత్‌చంద్ర, వెంకటయ్య, చంద్రశేఖర్ రెడ్డి, రాంరెడ్డి, పవన్, జంగయ్యగౌడ్, విజయ్, రాజశేఖర్, యాదగిరి, రాజు, వివిధ పార్టీల, సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

కారు బోల్తా.. తప్పిన పెను ప్రమాదం

చేవెళ్ల, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): అతివేగం, అజాగ్రత్తతో డ్రైవ్ చేస్తూ కారు బోల్తాపడిన ఘటన చేవెళ్ల పోలీస్‌స్టేషన్ పరిధిలోని తంగడ్‌పల్లి గ్రామంలో చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సిద్దిపేట జిల్లా గజ్వేల్‌కు చెందిన ఓ వ్యక్తి తన కుటుంబ సభ్యులతో కలిసి వికారాబాద్ జిల్లా తాండూర్‌లో జరిగే బంధువుల పెళ్లికి ఆదివారం ఇంటి నుంచి కారులో బయల్దేరారు. చేవెళ్ల మండల పరిధిలోని తంగడ్‌పల్లికి రాగానే కారు అదుపు తప్పి రోడ్డు పక్కన బోల్తాపడింది. గమనించిన స్థానికులు కారులో ఉన్న భార్యభర్తలతో పాటు ఇద్దరు పిల్లలను బయటకు తీశారు. నాలుగురిలో ఒక పాపకు స్వల్పగాయాలు కాగా మిగిలిన వారు క్షేమంగా ఉన్నారు. వారిని అంబులెన్స్‌లో వైద్యం కోసం చేవెళ్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఎవరికీ ఏ ప్రమాదం జరుగకపోవడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు.

ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలి


మాట్లాడుతున్న చీరాల రమేశ్

మంచాల. ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగట్టి, వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని బీఆర్‌ఎస్ మంచాల మండల అధ్యక్షుడు చీరాల రమేశ్ అన్నారు. ఆదివారం లింగంపల్లిలో బీఆర్‌ఎస్ కార్యకర్తల మండల స్థాయి విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆరు పథకాల హామీని ఎక్కడా పూర్తిగా అమలు చేయడం లేదని ఆరోపించారు. రంగాపూర్ నక్షత్రశాలను అన్ని విధాల అభివృద్ధి చేసి వ్యవసాయ పరిశోధనా కేంద్రంగా మార్చాలని డిమాండ్ చేశారు. రైతు రుణమాఫీ, సన్న వడ్లపై రూ.500 బోనస్ ఇంకా రైతులకు అందించలేదని ఆరోపించారు. నాయకులు రాజేందర్‌రెడ్డి, మైలారం ప్రభాకర్, మహేందర్ రెడ్డి, దచుక అశోక్, కరుణాకర్‌రెడ్డి, రాచకొండ పరమేశ్, బత్తుల కిషన్‌రెడ్డి, అమరేందర్ రెడ్డి, పృధ్వీధర్‌రెడ్డి ఉన్నారు.

కరాటే టోర్నమెంట్ కరపత్రం విడుదల


కరపత్రం అవిష్కరిస్తున్న రాజేష్‌పటేల్

చౌదరిగూడ ,ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): కొందుర్గు మండల కేంద్రంలో ఈనెల 23న నిర్వహించనున్న జిల్లా స్థాయి మూడో న్యూ మాంక్స్ కుంగ్ఫూ కరాటే పోటీల కరపత్రాన్ని జిల్లా అధ్యక్షుడు రాజేశ్‌పటేల్ విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ నెల 23న కొందుర్గులో నిర్వహించే కరాటే పోటీలో విద్యార్థులు ఆధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మాస్టర్ రమేష్, శ్రీధర్‌రెడ్డి, రామకృష్ణ, నరేష్, రాజు, గిరి పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన


ఉచిత వైద్య శిబిరంలో రోగులను పరీక్షిస్తున్న వైద్యులు


ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): శేరిగూడలో రంగారెడ్డి హెల్త్ కేర్ డైరెక్టర్ డాక్టర్ తేజస్వినీరెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ప్యాక్స్ చైర్మన్ పాండురంగారెడ్డి, బీఎన్‌రెడ్డి కార్పొరేటర్ లచ్చిరెడ్డి ఈ శిబిరాన్ని ప్రారంభించారు. 120 మంది రోగులకు వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. శిబిరంలో డాక్టర్ రాజేశ్వరీరెడ్డి, డాక్టర్ పవన్‌కల్యాణ్‌రెడ్డి, డాక్టర్ మదన్, డాక్టర్ నర్సింహులు, లయన్స్ క్లబ్ సభ్యులు రామచందర్‌రావు, గుర్రం శ్రీనివాస్‌రెడ్డి, ఆకుల యాదగిరి, అశోక్, మల్లేష్, మధు, మహేందర్ మెమోరియల్ నుంచి నర్సిహారెడ్డి, శ్రీదేవి పాల్గొన్నారు.

కమ్యూనిటీ భవన నిర్మాణానికి భూమిపూజ


భూమి పూజ చేస్తున్న బొదునంపల్లి గ్రామస్తులు

కేశంపేట, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని బొదునంపల్లి గ్రామంలో ఆదివారం ఎస్సీ కమ్యూనిటీ భవన నిర్మాణానికి కాంగ్రెస్ నాయకులు, గ్రామస్తులు భూమిపూజ చేశారు. కమ్యూనిటీ భవనం లేక ఎస్సీలు ఇబ్బందులు పడుతున్నారని మాజీ ఉపసర్పంచ్ నీలపాండు ఎమ్మెల్యే వీర్లపల్లిశంకర్ దృష్టికి తీసుకపోగా రూ.5 లక్షల నిధులు కేటాయించినట్లు తెలిపారు. గ్రామస్తులతో కలిసి భవన నిర్మాణానికి భూమిపూజ చేసినట్లు చెప్పారు. తమకు భవనం కేటాయించిన ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు గూడ వీరేశ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు బాలకిష్టి, నాయకులు లింగారెడ్డి, పిప్పల శేఖర్, బాలరాజు, హరేందర్, హరికుమార్, యాదయ్య, మల్లేష్, రామచంద్రయ్య, లక్ష్మయ్య, ఎదిరె చెన్నయ్య, యెన్నం కృష్ణా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

480 మందికి కంటి పరీక్షలు


కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

కడ్తాల్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చల్లంపల్లి గ్రామంలో ఆదివారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరం విజయవంతమైంది. గ్రామ నాయకుడు గుర్కా అఖిలాశ్రీకాంత్ ఆధ్వర్యంలో శిబిరం ఏర్పాటు చేశారు. కంటి వైద్య సహాయకుడు చంద్రశేఖర్ ఆధ్వర్యంలో శిబిరంలో 480 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. దృష్టి లోపం ఉన్నట్లు గుర్తించిన వారిని ఐఓఎల్ ఆపరేషన్ల నిమిత్తం సరోజినీ దేవి కంటి ఆస్పత్రికి తరలించారు. ఈ సందర్భంగా అఖిలాశ్రీకాంత్ మాట్లాడుతూ నేత్రదానంపై ప్రజలు అపోహలు వీడాలన్నారు. కార్యక్రమంలో వాడపల్లి ఆనంద్, చంద్రశేఖర్, శ్రీరాములు, కొమురయ్య, నరేందర్, దామోదర్ రెడ్డి, ప్రవీణ్, నాగరాజు, నారాయణ, అంజయ్య, ప్రభాకర్, శేఖర్, రామకృష్ణ, మల్లేశ్, వంశి తదితరులు పాల్గొన్నారు.